# వ్యాస రత్న ప్రభావళి

రచయిత

**డాక్టర్. గుంజి వెంకటరత్నం**

పూర్వ తెలుగు శాఖాధ్యక్షులు

సి.కె.యం. డిగ్రి & పి.జి. కళాశాల. వరంగల్.

ఎమెస్కో

# వ్యాస సూచిక


1. మహాభారతం శాస్త్ర కావ్యమా? కావ్యశాస్త్రమా? 9
2. భాగవతము–సార్వకాలీనత–సమకాలీనత 15
3. హంసవింశతి ఉపదేశాత్మక కావ్యమా? 24
4. జానపద వినోదం కోడిపందెం 31
5. తెలుగునాట వీథి బడుల తీరుతెన్నులు 39
6. సాహిత్య పరిశోధన–శాస్త్ర, సాంకేతికాంశాలు 45
7. శివభారతం స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి 54
8. తెలుగు నిఘంటువులు 61
9. మహాభారతం–విజ్ఞాన సర్వస్వ లక్షణాలు 75

# మహాభారతం శాస్త్ర కావ్యమా? కావ్య శాస్త్రమా?

మహాభారతంలోని శాస్త్రాద్యనేకాంశాలు ప్రతిపాదన దృష్ట్యా దానిని పరిశీలించిన వారికి అది కావ్య శాస్త్రమా? లేక శాస్త్ర కావ్యమా? అనే సందేహం రాక మానదు. ప్రపంచ భాషల్లోని ఏ వాఙ్మయంలోనైనా కావ్యం, శాస్త్రం అనే రెండు రచనా ప్రక్రియలుంటాయి. కావ్యం వేరు, శాస్త్రం వేరు. పాశ్చాత్య సాహిత్యవేత్తలు కర్తృత్వ ఆపేక్ష నిరూపణలను బట్టి, వాఙ్మయాన్నంతటిని కావ్యం, శాస్త్రం అని రెండు విభాగాలుగా విభజించారు. కవి యొక్క ఆత్మీయతా ప్రతిఫలనం గల రచన కావ్యమని, అది లేనిది శాస్త్రమని పాశ్చాత్యుల సిద్ధాంతం. (సాహిత్య శిల్ప సమీక్ష పుట-151).

కావ్యం, శాస్త్రం వేరు వేరు ప్రక్రియ లైనప్పుడు వాటి నిర్మాణం వాటి ప్రయోజనాలు కూడా వేరు వేరుగా ఉంటాయి. కావ్యం రసాత్మకమైనది, ఉపదేశాత్మకమైనది. అది సహృదయునికి రసానందంతో పాటు ఏదో ఒక సందేశాన్ని కూడా ఇస్తుంటుందని ప్రాచీనాలంకారికుల అభిప్రాయం. ఈ దృక్కోణం నుండి భారతాన్ని పరిశీలించినప్పుడు ప్రధానంగా శాంతిరస పోషకమై ఆయా సన్నివేశాల్లో శృంగారాది రసాలు పోషింపబడి, ఉపదేశాత్మకమై ఉండడం వలన ముఖ్యంగా అది కావ్యమనే చెప్పవలసి ఉంది. అయితే భారతంలో చోటు చేసుకొని ఉన్న వివిధాంశాల విషయమేమిటి? అసలు రసాత్మకమైన కావ్యంలో శాస్త్రాంశాల ప్రతిపాదన ఉండవచ్చునా? ఉంటే ఎలా ఉండాలి? మొదలైన ప్రశ్నలుదయిస్తాయి.

భరతుడు కావ్యంలో శాస్త్ర, కళా, విద్యాది విజ్ఞానాంశాల ప్రతిపాదన లుండవచ్చునని నిర్దేశించాడు.

> "నతత్ శాస్త్రం, నతత్ శిల్పం, నసా విద్యా నసాకళా
> నా సౌ యోగో తత్కర్మణ్యంత్యే ఽస్మిన్ యన్న దృశ్యతే"

ఇది దృశ్యకావ్యాలను గురించి చెప్పినా శ్రవ్య కావ్యాలకు కూడా వర్తిస్తుంది. భామహుడు కూడా కావ్యాల్లో శాస్త్రాంశాల ప్రతిపాదనను అంగీకరించాడు.

> "స్వాదు కావ్యరసోన్మిశ్రం శాస్త్ర మప్యుపయుంజతే
> ప్రథమాలీఢ మధువః పిబంతి కటు భేషజమ్"

కావ్యంలో ఎడనెడ శాస్త్ర విషయాలుద్దిష్టాలైనా, అవి ఆమోద యోగ్యాలే అవుతాయి. ఎందుకంటే మొదట తియ్యని మధువును సేవించిన వారే, తర్వాత చేదైన ఔషధాన్ని కూడా త్రాగుతారు గదా! అంటే రస స్ఫోరకమైన కావ్యం మొదట పాఠకునికి ఆనందాన్ని కలిగిస్తూనే పిమ్మట అందులోని శాస్త్రాంశాలు కటు భేషజంలాగా ఆరోగ్యాన్ని, దృఢత్వాన్ని కలిగిస్తాయి. కాబట్టి కావ్యంలో శాస్త్రాంశాలు ప్రతిపాదన కూడా ఆమోద యోగ్యమేనని భామహుని అభిప్రాయం.

మనకు ప్రాచీన కాలం నుండి నిఘంటు నిర్మాణ ప్రక్రియ ఉంది కాని, విజ్ఞాన సర్వస్వాల నిర్మాణాలున్న దాఖలాలు కనిపించవు. అందుకే కాబోలు విజ్ఞాన ప్రసారాపేక్ష గల మన ప్రాచీన కవులు కొందరు అవసరమున్నంత వరకు, అంతకు మించి కూడా విజ్ఞానాంశాలెన్నింటినో తమ కావ్యాల్లో పొందు పరుస్తూ వచ్చారు. అదీ గాక సమకాలీన సామాజిక విషయాలెన్నో ఆనాటి సాహిత్యంలో సహజంగానే చోటు చేసుకుంటూ ఉంటాయి. అందుకే ప్రాచీనాలంకారికులు మన వాఙ్మయాన్ని శాస్త్రం, కావ్యం, శాస్త్ర కావ్యం, కావ్య శాస్త్రం అని నాలుగు విధాలుగా విభజించారు.

> "శాస్త్రం, కావ్యం, శాస్త్ర కావ్యం, కావ్య శాస్త్రం చ భేదతః
> చతుష్ట ప్రకారః ప్రవరః సతాం సారస్వతో మతః"
> (సాహిత్య దర్పణం (హిందీ వ్యాఖ్యానం)(పుట. 553)

శాస్త్రం, కావ్యం, అనే వాటిని గూర్చి పైన చెప్పడం జరిగింది. ఇప్పుడిక శాస్త్ర కావ్యమంటే ఏమిటో? కావ్య శాస్త్రమంటే ఏమిటో? వాటిని గూర్చి అలంకారికులేమి చెప్పారనే నేపథ్యంలో మహాభారతం శాస్త్ర కావ్యమా? కావ్య శాస్త్రమా? అని పరిశీలించవలసి ఉంది. సాహిత్య దర్పణ కారుడు శాస్త్ర కావ్యాన్ని, కావ్య శాస్త్రాన్ని విశ్లేషిస్తూ ...

> "శాస్త్ర కావ్య మిదం ప్రాహుః సర్వ కావ్యాంగ లక్షణం
> కావ్యం విశిష్ట శబ్దార్థ సాహిత్య సదలంకృతిః
> శాస్త్ర కావ్యం చతుర్వర్గప్రాయం సర్వదేశాపకృత్
> భట్టి భౌమక కావ్యాది కావ్య శాస్త్ర ప్రచక్షతే"

చతుర్వర్గ ప్రాయమైనది, అంటే ధర్మ, అర్థ, కామ, మోక్ష సాధకమై, పరిపూర్ణ మానవ జీవితానికి వ్యాఖ్యాన రూపమైనది శాస్త్ర కావ్యమని చెప్పడం జరిగింది. (వ్యాసుడు కూడా భారతాన్ని ఇదే విధంగా భావించాడు. సంస్కృత భారత విషయం వచ్చినప్పుడు క్రింది పేరాల్లో ఈ విషయం చర్చించడం జరిగింది) అదే విధంగా రసాత్మకమై ఉపదేశాత్మకమైనది